# అలవాటు లేని ఔపోసన

శ్రీ వీరుబొట్ల శ్రీరామశర్మ

అక్కడే వుంది అసలుసంగతి. అసలునాకు కోపం రానే రాదు; వస్తే నేను మనిషినికాను. అంటే ఏ పశువునో అనిమాత్రంకాదు. అలా కోపమొచ్చినప్పుడు — నాలో మనిషి కుండవలసిన దయాదాక్షిణ్యాలు ఏ కోశానా కనుపించవు.

ఎన్నాళ్ళు ఎన్నాళ్ళని ఊరుకున్నాను. ఊరుకున్నంత మాత్రాన నన్నుత్త వెధవాయిక్రింద జమకట్టిపారేయటమే! రోజూ ఉదయం పదిగంటల దగ్గరనుంచి సాయంత్రం ఆఫీసులోఉన్న ఆ టి. సి నాటి టపాసుగడియారం ఐదు గంటలు కొట్టేవరకూ—అంటే రోజుకి ఏడుగంటల చొప్పున—ముప్పై రోజులూ—అంటే రెండువందల పది గంటలు కష్టపడి కష్టపడి నేనుసంపాదించిన జీతం యీవిడగారి స్నోసీసాలకూ, ఫేసుపౌడర్లకూ, హెయిర్ ఆయిల్సుకూ, సిల్కుచీరలకూ కట్ట బెట్టమని నా మొహాన యినపగంటం పుచ్చుకొని ఏవేళ రాసేదోకాని ఆ బ్రహ్మ దేవుడు—అక్షరాలా అంతా జరిగి తీరుతోంది.

అందుకే సరోజమీద నాకుకోపం వచ్చింది. లేకపోతే యింత కష్టపడుతున్ననాకు 'ఫస్టు ఫిల్టరు కాఫీ త్రాగే' యోగంలేదూ! ఈవిడకేదో కాస్త ఒళ్ళు వెచ్చగావుండేటప్పటికల్లా (మాఅత్తారి ఆవకాయ పుణ్యమా అంటూ) ఆడాక్టరు 'మీలోసరియైన ఉత్సాహంరావాలంటే రోజూ ఉదయమె మీరు 'ఫస్టుఫిల్టరు కాఫీ'త్రాగాలని' చెప్పి యేడిశాడట. పోని ఏదో తెలియక చేశాడనుకుందాం! ఇంతకీ నాకామాత్రం విలువలేదూ నాయింట్లో? "డాక్టరిట్లా అన్నాడండి" అని కులుకుతూ చెప్తుందా—సిగ్గులేకుండా—అందులో నాతో!

అక్కడికీ తొందరపడటం మంచిది కాదని పెద్దవాళ్ళు ఎప్పుడో అన్నారన్న విషయం జ్ఞాపకంవచ్చి, నిర్ణయానికి వచ్చేముందు అమాంతంగా సరోజని పిలిచి "ఇంతకీ 'ఫస్టు ఫిల్టరు' కాఫీరాత లేదన్నమాటేగా నామొహానికి" అన్నాను కోపంగా కళ్ళెర్రజేసి (నోట్లో వున్నకిళ్ళీమీద బలాన్నంతా ప్రయోగిస్తూ)

"ఎందుకండీ అంత కోప్పడతారు. డాక్టరన్నాడని ఊరికే అన్నానుగాని" అన్నది సరోజ.

"అన్నాడట అన్నాడు—నేనిలా ఊరుకుంటున్నాననేగా యీ మాటలంటున్నావ్. నాలుగురోజులు నేనూళ్ళో లేకపోతే తెలిసివస్తుంది అమ్మగారితంతు" అని పళ్ళు పట పట కొరుకుతూ—సరోజ పిలుస్తున్నా వినిపించుకోకుండా రైల్వేస్టేషనుకు పరుగుతీశాను.

• • •

బందరులో బి.యస్. సి. వెలగబెడుతున్న మామేనల్లుడు సుధాకర్ జ్ఞాపకంవచ్చాడునాకు. ఇప్పుడువాడికి పరీక్ష రోజులుకాబోలు. ఎలా చదువుతున్నాడో యేమో వెధవ! వాడిని చూచినట్లూ అవుతుంది అని 'బుకింగ్ ఆఫీసుకు' వెళ్ళి బందరుకు ఒక 'టిక్కెట్టు' కొనేశాను.

బందరు చేరేటప్పటికి పది గంటలయింది. మావాడు కాలేజీకి వెళ్ళివుంటాడేమో సరే! అంతగా అయితే ఇంకా ఎక్కడికైనా పోవచ్చు పెట్టె, బెడ్డింగు యిత్యాదయః ఏమీలేవుగా. 'కేకినీ మహలు' దగ్గరికి రెండణాలకు రిక్షా కట్టించుకుని వెళ్ళాను.

మావాడి రూము తీసేవున్నది. లోపలకు వెళ్ళిచూద్దును కదా-వాడింకా ముసుగుతన్ని నిద్రపోతూన్నాడు.

"ఒరేయ్! సుధాయ్!" అని నిద్ర లేపేసరికి కళ్ళు నులుముకుంటూ "నువ్వా! ఎప్పుడొచ్చావ్ మామయ్యా" అంటూ లేచాడు.

"ఇప్పుడే వచ్చాను కానీ నువ్వుకాలేజీకి వెళ్ళలేదేంరా?"

"ఏంలేమిలే. నువ్విలా కుర్చీలో కూర్చో మామయ్యా"

"ఏంకథ? కొంపతీసి తలనొప్పి, జ్వరం వగైరా వగైరా లేమీ లేవు కదా"

"అటువంటి వేమీలేవు దేవుడి దయవల్ల"

"అయితే కాలేజీ మానెయ్యటానికి గల కారణం?"

"రాత్రి ఒక చిన్న సంఘటన జరిగిందిలే చెప్తాను" అంటూ బయటకు చూసి ఎవరూలేరనే నిర్ధారణకు వచ్చి చెప్పటం ప్రారంభించాడు సుధాకర్ :-

"మాకిప్పుడు సెలక్షన్ ఎగ్జామినేషన్స్ అని తెలిసే వుంటుందినీకు ఈసారి బాగా స్ట్రిక్టుగా వుండాలను

కుంటున్నారు మా ప్రిన్సిపాల్ గారు. వారానికో "స్లిప్ టెస్ట్" చొప్పున దంచుతున్నారు లెక్చరర్లు. అందుకని మా హిందూ కాలేజీ వాళ్ళంతా రాత్రింబగళ్ళు నూరిపారేస్తున్నారు. నాకు యింతవరకూ ఓ మాదిరి మంచి మార్కులే వస్తున్నాయి కనుక నేనంత విద్రాహారాలు మాని చదవ వల్సిలేదు. కాని మా వాళ్ళందర్నీ చూసేసరికి నాకూ ఒక రాత్రల్లా కూర్చొని చదవాలనిపించింది. అందుకో వస్తు పేపరు ఫిజిక్సు. ఈసారి వస్తు మార్కులు రావాలని రాత్రల్లా కూర్చుని చదువుదా మనుకొన్నాను. కాని రాత్రిపదిగంటల య్యేసరికల్లా—దానిదుంపతెగ నిద్రముంచు కొచ్చేసింది. ఏనాడూలేనిది నిన్నకాళ్ళీడ్చుకుంటూ స్వతంత్ర హోటలు దాకాపోయి కాసిని టీనీళ్ళు గొంతులోపోసుకుని వచ్చికూర్చున్నాను. కొంతవరకైనా ఉషారుగావున్నది. కాని దాని దుంపతెగ చలికాలం తలుపులన్నీవేసి చదవటం ప్రారంభించాను. చలి మూలాన చక్కగా వెచ్చగాముసుగు తన్ని పడుకోవాలనిపిస్తోంది. 'ఈచలి పోవటానికి ఏమిటి ఉపాయం!' అని తలబద్దలుకొట్టుకున్నాను. దరిదాపు మార్గం చెప్పలేని ఫిజిక్సు పుస్తకాలమీద నాకు 'బోలెడు' కోపంవచ్చేసింది. ఇంతలో హఠాత్తుగా జ్ఞాపకంవచ్చింది. మొన్న మా మూర్తి "యీచలికాలంలో సిగరెట్టుముట్టించి కూర్చుంటే బలేఉషారుగా వుటుందోయ్ చలివెయ్యదు ఛస్తేనిద్రరాదు" అన్నాడు. కాని అప్పటికే ఒంటిగంట అయింది. అలా బయలుదేరి కొట్లో గుట్టు పెట్టి నిద్ర పోతూన్న అంజయ్యని లేపి ఒక 'సిజర్స్‌ప్యాకెట్' యివ్వమన్నాను. వాడు తనలోతాను సణుగుకుంటూ పైకి వినిపించకుండా తిట్టుకుంటూ 'ప్యాకెట్' అందిచ్చాడు. రూముకువచ్చి ముట్టిద్దామనుకుంటే 'అగ్గిపెట్టె' లేదు. అలవాటులేని ఔపోసనకాదూ! సిగరెట్టు ముట్టించటానికి 'అగ్గిపెట్టె' అనేది ఒకటి కావాలనికూడా నాకప్పుడు జ్ఞాపకంలేదు. మళ్ళీ అంజయ్య కొట్టుకు వెళ్ళానా యీసారి తిట్లతోబాటు తన్నులుకూడా తగలగలవు. అందుకుతోడు జేబుతడుముకుంటే ఎట్టుని యేగానీకూడాలేదు. ఇంతలో ఒక 'ఐడియా' తట్టింది టైముచూస్తే ఒంటిగంట అయింది 'సెకండ్ షో సినిమా' వదిలివుంటారు బహుశా, ఆరోడ్డు మీద నుంచుని, మనవాడెవడైనా దర్శనమిస్తే అగ్గి పెట్టె అడిగి తీసుకోవచ్చునుగదా అనుకున్నాను.

అమావాస్య. బందరు మునిసిపాలిటీ ధర్మమా అంటూ మాచిలకలపూడి రోడ్డు మీది లాంతరు స్తంభాలు నిద్ర పోతున్నాయి అంతాచీకటి.... దానికి తగ్గట్టు యీమురుగాలి...కాని అటువంటి సమయంలోనే రామానాయుడు పేటసెంటరు దగ్గర బయలుదేరాను...క్రొత్తగా ఆరాధించబోయే అగ్నిహోత్రుడిమీది ఆప్యాయత కొద్దీ.

స్టూడెంట్ లైఫ్‌లో నాలుగేళ్ళు ఆగిపోయిన వాడిని నేనూహించానంటే అదితప్పవటమా! దుర్గాలో మేనరికం రెండవ ఆట అయిపోయింది ఎవరెవరో వస్తున్నారు. అదృష్టవంతుణ్ణి చెడగొట్టె వాళ్ళెవరని ధూమకేతువు పూరికే అన్నాడా! ఎవరో ఒకమనిషి 'సిగరెట్టు' కాల్చుకుంటూ అటేవస్తున్నాడు, దగ్గరదాకా వచ్చిన తర్వాత 'ఒక్కసారి అగ్గిపెట్టెయిస్తారా సార్' అన్నాను. ఆమనిషి కాసేపాగి చొక్కాజేబులోనుంచి అగ్గిపెట్టె తీసియిచ్చాడు. అగ్గిపుల్ల వెలిగించాను...అంతే! నోట్లోవున్న సిగరెట్టు క్రిందపడి పోయింది కాళ్ళల్లో వణుకుపుట్టింది. అగ్గిపెట్టె అయినవ మొహానవేసి పరుగెత్తుకుని రూముకువచ్చి ముసుగుతన్ని నిద్రపోయాను "నాకు అగ్గిపెట్టెఅందిచ్చినది ఎవరోకాదు—మా ఫిజిక్సు లెక్చరర్. విద్యార్థి దశలో ఎవరూ సిగరెట్లు కాల్చకూడదని పదిసార్లయినా ఉపన్యసించాడాయన. రేపొద్దున క్లాసుకువెళ్ళానంటే "Dont you know manners please" అని తగులుకుంటే సమాధానం ఏమని చెప్పటం? ఒక్క రెండురోజులాగుతే వేడికొంత తగ్గవచ్చు" అంటూ కధముగించాడు సుధాకర్.

"ఏడిచావ్‌లే! యిటువంటి వెధవ్వేషాలు ఎప్పుడూ వెయ్యకు, మర్యాద నేర్చుకో. ఇప్పుడు కాకపోతే మరొకప్పుడైనా చిక్కుల్లో పడగలవ్" అని వాణ్ణి నాలుగు చివాట్లు పెట్టాను. వాడేమీ మాట్లాడలేదు టైముచూశాను. పన్నెండయింది. కడుపులో నక నకలాడు తోంది.

"ఒరేయ్ సుధాయ్! నేనోచిన్న పనిమీద వచ్చాను. అదిపూర్తి చేసుకుని వస్తాను" అంటూ బజారులోకి బయలుదేరాను.

కళ్ళు తిరిగి పడి పోతానేమోననిపిస్తోంది. నిన్న సాయంత్రం సరోజ చేతిభోజనం. ప్రొద్దున్నే కాఫీ అన్నా త్రాగలేదు అలా మోడరన్ కేఫ్‌లోకి దారి తీశాను. అర్ధ రూపాయి చెల్లించి. ఒకభోజనం టికెట్టు తీసుకుని లోపలకువెళ్ళి విస్తరిముందు కూర్చున్నాను. కాకరకాయ కూరతెచ్చి వేశాడు, కాలకూట విషమైన తినగలను గాని

కాకరకాయ కూరను మాత్రం భరించలేను నేను. ఇంకా ఏమైనా ఉన్నాయా అంటే ఇంతసాంబారు తెచ్చిపోశాడు. ఎలాగో నాలుగు మెతుకులు కొరికాను. ఈ అర్ధాకలి భోజనం చేస్తూంటే కళ్ళవెంట నీళ్ళుతిరిగాయి. ఎలాగో బయటపడి ప్రక్కనవున్న కిళ్ళీకొట్టులో ఒక కిళ్ళీ కట్టించుకుని బజారులోకి బయలుదేరాను.

నాలుగడుగులు వెళానోలేదో దవడ మండిపోవటం ప్రారంభించింది. నాకర్మకాలి సున్నం మహాశాస్త్రిగా వేశాడు. సరోజ జ్ఞాపకం వచ్చింది ఇంతవరకూ సరోజను విడిచివుండలేదునేను గబగబానడిచి పట్టాభి మార్కెట్టులో ఒకగుంటూరు చీరకొని స్టేషనుకు వెళ్ళి రైలెక్కాను సరోజలో మునిమాణిక్యంగారికాంతాన్ని ఊహించుకుంటూ.

---



# కోకిలమ్మ

శ్రీ కే. తిరుపతయ్య

తే. గీ. చూతవృక్షమ్ము పైనుండి సుందరముగ
గూతలను నెట్టుచుండిన కోకిలమ్మ
చెలియ నెచటైనగన్నచో చెప్పవమ్మ
మదిని నీమేలు నెన్నడు మరువనమ్మ.

తే. గీ. ప్రియను గానక నిప్పుడు వేదనమున
కుములుచున్నది నామది కోకిలమ్మ
సఖియ నా చెంత నున్నట్టి సమయమందు
నాలపించిన గీతమ్ము నాలపించు.

తే. గీ. నాకునీవలె రెక్కలీ లోకమందు
గలిగి యుండిన నెగురుచు కలికిచెంత
వాలి యుందును గానియా భాగ్యరేఖ
ఫాలభాగమ్ము నందున వ్రాయలేదు.

తే. గీ. పగలు రేతిరి యనక నీ పాటవినుచు
బాగలు చుండిన మదిలోని దిగులునెల్ల
బాపికొందును కోకిలా ! పాడవమ్మ
చూతపల్లవముల గోసి పోతునీకు

తే. గీ. ఎగిరిపోకమ్మ నాగాధనెరిగినావు
ఎగిరిపోయిన నామది దిగులు మిగులు
తరిగిపోవునుహృదయమ్ము దయను
గొనుము
ప్రేమికుల నూరడించెడి పికమునీవు.

తే. గీ. మరణమరుదెంచు నందాక మనసులోని
మమతలన్నియు కోకిలా ! మాసిపోవు
ధరణినాకింక నీపాటె శరణమమ్మ
ఆలపించుము ప్రణయ గీతాలనిపుడు.